

అన్నదానంలో పాల్గొన్న మంత్రి వేణుగోపాలకృష్ణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

శాటిలైట్ సిటీ శివాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన అన్నదానంలో ఆదివారం మంత్రి వేణుగోపాల కృష్ణ స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భగా మంత్రి వేణు మాట్లాడుతూ శివరాత్రి పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త శక్తిని తీసుకువచ్చి. వారు అనుకున్న లక్ష్యాలు నెరవేరాలని కోరుకుంటున్నానన్నారు. మంత్రి వేణు అన్నదానంలో యాత్రికులకు స్వయంగా వడ్డించారు. నక్కా. రాజబాబు పాల్గొన్నారు.



అన్నదానంలో పాల్గొన్న మంత్రి వేణు

బిజెపి పొత్తుతో కూటమిలో సెగ

- టిడిపి, జనసేనతో సర్దుబాట్లు
- పార్లమెంటు స్థానం బిజెపికే..?
- అంతర్మథనంలో టిడిపి నేతలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

టిడిపి, జనసేన కూటమిని బిజెపి పొత్తు సెగ వెంటాడుతోంది. బిజెపితో పొత్తు కోసం టిడిపి అధినేత చంద్రబాబు చేసిన ప్రయత్నాలు ఫలించిన విషయం విదితమే. అయితే తాజా నిర్ణయం కూటమి నేతలకు లాభనష్టాలు తెలియాలంటే ఎన్నికల ఫలితాల వరకు వేచి చూడాలి. కేంద్రంలో బిజెపి అనుసరిస్తున్న విధానాలకు గత ఐదేళ్లుగా అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి పోటీ పడి పార్లమెంటులో మద్దతు తెలిపిన విషయం విదితమే. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక పార్టీకి అధికార, విపక్ష పార్టీలు తమ మద్దతు తెలపడానికి తెరవెనుక రాజకీయాలే కారణమనే ఆరోపణలు సైతం లేకపోలేదు. 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రత్యక్ష మద్దతు కోసం టిడిపి చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఇప్పటికే టిడిపి, జనసేన మద్దతు నేపథ్యంలో టిడిపి ఆశావహుల్లో నిరుత్సాహం నెలకొంది. తాజాగా బిజెపితో పొత్తు కుదరడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. టిడిపి, జనసేన కూటమి ఇప్పటికే తొలి జాబితా విడుదల చేసిన విషయం విదితమే. జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలు, ఒక పార్లమెంటు స్థానానికి గానూ కేవలం మూడు సీట్లకు మాత్రమే తొలిజాబితాలో చోటు దక్కింది.

పార్లమెంటు స్థానం బీజేపీకే...?

రాజమండ్రి పార్లమెంటు స్థానం బీజేపీకే కేటాయించినట్లు తెలుస్తోంది. ఈ స్థానం నుంచి మాజీ మంత్రి దగ్గుబాటి పురందేశ్వరి పోటీ చేస్తారని తెలుస్తోంది. టిడిపి, జనసేనతో బిజేపీ పొత్తు నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆరు పార్లమెంటు స్థానాలు, జనసేన-బీజేపీకి కలిపి 30 స్థానాలు కేటాయంచిన విషయం విదితమే. అయితే బిజేపీ పార్లమెంటు స్థానాలపై కేంద్రీకరించినట్లు తెలుస్తోంది. ఆ పార్టీ కోరిన స్థానాల్లో రాజమహేంద్రవరం కూడా ఒకటని తెలుస్తోంది. గతంలో గెలుపొందిన నియోజకవర్గం కావటంతో కలిసొస్తుందని బిజేపీ ఆశిస్తోంది. అయితే రాష్ట్ర విభజన అనంతరం విభజన హామీలు అమలు చేయటంలో బిజేపీ రాష్ట్రానికి మొండి చేయి చూపించింది. మరోవైపు పోలవరం ప్రాజెక్టుకు నిధులు విడుదల చేయటంలోనూ పూర్తి నిర్లక్ష్యం వహించింది. మరోవైపు మైనార్టీలు, క్రైస్తవులపైన దాడులు ఇటీవల పెరిగిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో బిజేపీతో పాటు ఆ పార్టీతో పొత్తుపెట్టుకున్న టిడిపి కూటమికీ ప్రతికూల పరిస్థితులుత ప్పవనే సంకేతాలు విన్పిస్తున్నాయి.

టిడిపి-జనసేనలో సర్దుపోట్లు

జిల్లావ్యాప్తంగా 7 నియోజక వర్గాల్లో ఇప్పటికే టిడిపిలో ఆశావహుల మధ్య పోటీ నెలకొంది. నిడదవోలు నియోజకవర్గంలో బూరుగుపల్లి శేషారావు, ప్రముఖ వ్యాపారవేత్త కుందుల సత్యనారాయణ టికెట్ కోసం పోటీ పడుతున్నారు. ఈ ఇద్దరినీ కాదని జనసేనకు కేటాయించటంతో కందుల దుర్గేష్ ఈ స్థానంలో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు. అయితే టిడిపి నేతల నుంచి ఏ మేరకు సహకారం లభిస్తుందో వేచి చూడాలి. గోపాలపురం నియోజకవర్గంలో మద్దిపాటి వెంకటరాజుకు సొంత పార్టీలోనే అసమ్మతి వెంటాడుతోంది. కొవ్వూరు నియోజకవర్గంలో మాజీ మంత్రి జవహర్, అదే పార్టీలో మద్దిపట్ల శివరామకృష్ణ రెండు వర్గాలుగా ఏర్పడి అధినేత నుంచి ఎవరికి వారే టికెట్ ఆశిస్తున్నారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజక వర్గంలో సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి సీటు కోసం చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఈ నియోజక వర్గంలో జనసేన నుంచి ప్రతికూల పరిస్థితులు ఎదురువక తప్పదని తెలుస్తోంది. రాజానగరం టికెట్ ఆశించి భంగపడిన టిడిపి నేత బొడ్డు వెంకట రమణచౌదరి వర్గం ఇప్పటికే అసమ్మతిని వెల్లడించింది. ఈ పరిస్థితుల్లో బిజేపీతో జట్టు కడితే ఏడు నియోజక వర్గాల్లో ఏ నియోజక వర్గం కేటాయిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

అంబేద్కర్ స్ఫూర్తితో పని చేస్తా

ప్రజాశక్తి -తాళ్లపూడి

ప్రపంచ మేధావి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కుల పరిరక్షణకు పని చేస్తానని ఎస్సి కమిషన్ ఎం.విక్టర్ ప్రసాద్ అన్నారు. కొవ్వూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఆయన ఆదివారం పర్యటించారు. వేగేశ్వరపురంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. యువతకు హక్కుల మరియు జీవనోపాధిపై పలు సూచనలు చేశారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉన్నత చదువులు చదువుకోవాలని సూచించారు. రాజ్యాంగంలో యువతకు ఎన్నో హక్కులు కల్పించబడ్డాయన్నారు. సమాజంలోని ప్రజలు అందరూ స్వేచ్ఛగా బతకడానికి అంబేద్కర్ ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని భావితరాలకు రాజ్యాంగాన్ని అందించారన్నారు. అనంతరం బల్లిపాడు, వేగేశ్వరపురం, తాళ్లపూడి, ప్రక్కిలంక గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు ఆయన పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన వెంట భానుచందర్, గూడా విజయరాజు, యాళ్ల సునీల్, కె.అశోక్, యు.రవి, కె.భీమరాజు, ఎ.శ్రీను, కె.శివయ్య, పి.కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.



వేగేశ్వరపురంలో మాట్లాడుతున్న విక్టర్ ప్రసాద్

రైతు ఇంటి ముంగిటకే అన్ని సేవలు

ప్రజాశక్తి -గోపాలపురం

గతంలో ఎన్నడూ లేని విధంగా రైతుకు అవసరమైన అన్ని సేవలూ గ్రామంలోని జగనన్న ప్రభుత్వం అందిస్తోందని హోమ్ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత తెలిపారు. రైతులందరూ సంతోషంగా ఉండాలి, వ్యవసాయం అంటే పండగలా చేసుకోవాలని అనేక రైతు సంక్షేమ కార్యక్రమాలను జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టారన్నారు. గోపాలపురం మండలం వేళ్ళచింతలగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆదివారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వంగా పనిచేస్తుందన్నారు. విత్తనం దగ్గర నుంచి పంట విక్రయం వరకూ అన్ని వేళలా రైతులకు జగనన్న ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో విస్తారంగా పండిన ధాన్యాన్ని మంచి గిట్టుబాటు ధరతో ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. నవరత్నాలలో భాగంగా రైతు భరోసా సాయం కింద దేశంలో ఎక్కడా లేనివిధంగా కౌలు రైతులకు సైతం సంవత్సరానికి రూ.13,500 చొప్పున అందిస్తున్నామన్నారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మిన ప్రభుత్వంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి తానేటి వనిత తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మంత్రి తానేటి వనిత

మంత్రి వనిత సమక్షంలో భారీగా చేరికలు

ప్రజాశక్తి -గోపాలపురం

వేళ్లచింతలగూడెంలో హోమ్ మంత్రి తానేటి వనిత సమక్షంలో టిడిపి, బిజెపిల నుంచి ఆదివారం వైసిపిలో భారీగా చేరారు. నాయకులకు వైసిపి కండువాలు కప్పి మంత్రి తానేటి వనిత ఆహ్వానించారు. బేదంపూడి గంగాజలం, బేదంపూడి వెంకట్రావు, సాయిల బాబూరావు, జొన్నకూటి సువర్ణ రాజు, కవులూరి చినవెంకటరావు, కవులూరి పెదవెంకట్రావు, కుక్కల రామారావు తదితర 30 కుటుంబాల వరకూ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ.. జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి పార్టీలో చేరుతున్నారని మంత్రి తానేటి వనిత తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బిసి సదస్సుకు తరలిన నాయకులు

ప్రజాశక్తి -చాగల్లు

రాజమహేంద్రవరం మార్గాని ఎస్టేట్‌లో ఆదివారం నిర్వహించిన బిసిల ఆత్మీయ సదస్సుకు చాగల్లు మండలం చాగల్లు, ఊనగట్ల గ్రామాల నుంచి పలువురు వైసిపి నాయకులు కౌరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తరలి వెళ్లారు. కార్లు, బైకులపై వైసిపి నాయకులు భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బిసిలకు అత్యధిక స్థానాలను కేటాయించి, రాజకీయంగా గుర్తింపు ఇచ్చిన వైసిపిని పార్టీలకు అతీతంగా ఓటు వేసి గెలిపించాలనపి కోరారు. ఈ కార్యక్రమలో బొర్రా కృష్ణ, కోడి నాగేశ్వరరావు, కె.సతీష్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఫోటోగ్రాఫర్స్

గోకవరంలో కొవ్వొత్తులతో ఫొటోగ్రాఫర్ల ర్యాలీ

ప్రజాశక్తి -గోకవరం

మండల కేంద్రంలో ఫోటో, వీడియోగ్రాఫర్స్ యూనియన్ సంఘం సభ్యులు ఆధ్వర్యంలో ఆదివారం కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖపట్నంకు చెందిన ఫోటోగ్రాఫర్ విజయ్ పవన్‌ను రావులపాలెంలో ఈవెంట్ ఉందని ఫోటో షూట్‌కు పిలిచి అతడి వద్ద ఉన్న ఖరీదైన కెమెరాలను కోసం దారుణంగా హత్య చేశారన్నారు. వారిపై ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో గోకవరం దేవిచౌక్ నుండి ప్రధాన రహదారి మీదుగా పంచాయతీ కార్యాలయం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం విష సంస్కృతి

ప్రజాశక్తి -కడియం

రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి దిష్టి బొమ్మ దహనం విష సంస్కృతికి చిహ్నమని కడియం టిడిపి నేతలు పేర్కొన్నారు. టిడిపి మండల అధ్యక్షులు వెలుగుబంటి నాని ఆధ్వర్యంలో స్థానిక దేవిచౌక్ సెంటర్‌లో గోరంట్ల చిత్రపటానికి ఆదివారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ బిసి వర్గాల విభజనకు దారి తీసే విధంగా మంత్రి చెల్లబోయిన వేణు చర్యలు ఉన్నాయని ధ్వజమెత్తారు. విభజించి పాలించు అనే సూత్రాన్ని రూరల్ నియోజకవర్గంలో ప్రవేశపెట్టాలని చూస్తే సహించబోమన్నారు. ఎవరు ఎన్ని కల్లిబొల్లి మాటలు చెప్పినా ఇక్కడ బిసిలంతా ఏకతాటిపై ఉన్నామన్నారు. ఎంఎల్‌ఎగా గోరంట్ల బుచ్చయ్య చౌదరికి హ్యాట్రిక్ విజయాన్ని అందించేందుకు తామంతా సంసిద్ధంగా ఉన్నామన్నారు. ఎన్నడూ లేని విధంగా దిష్టిబొమ్మల దహనం సంస్కృతి మంత్రి వేణుతో పాటుగా ఇక్కడకు రావడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో మార్గాని సత్యనారాయణ, చెల్లుబోయిన శ్రీనివాస్, పితాని శివరామకష్ణ, ముత్తాబత్తుల విజయ, యనమదల రాజు, అన్నందేవుల చంటి, బోడపాటి గోపి, వాసంశెట్టి నాగబాబు, జల్లి కృపారావు, గుర్రపు సత్యనారాయణ, జోగి చక్రవర్తి, వనుం సూరిబాబు, గుత్తుల కృష్ణ, షేక్ సిద్దయ్య, అనసూరి గోవిందు, గోరు నాగేశ్వరరావు, వరగోగుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు





టిడిపిలో చేరిన నాయకులతో నెహ్రూ

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి -గోకవరం

కృష్ణునిపాలెం పంచాయతీలో పలువురు ఆదివారం టిడిపిలో చేరారు. వెంకటాపురం, రామన్నపాలెం గ్రామాల నుంచి వైసిపికి చెందిన ఎస్‌టిలు, బిసిలు సుమారు 100 మందికి తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల వైసిపి పాలనలో బిసిలు, ఎస్‌టిలు అన్ని రకాలుగా వెనకబడ్డారని చెప్పారు. బిసిలకు డిక్లరేషన్ ప్రకటించిన టిడిపి జనసేన బిజెపి సంకీర్ణ ప్రభుత్వం రావాలన్నారు.



కడియంలో కవాతు చేస్తున్న పోలీసులు

ప్రజల్లో ధైర్యం నింపేందుకు ఫ్లాగ్ మార్చ్

ప్రజాశక్తి -కడియం

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి ఆదివారం పోలీసులు కవాతు నిర్వహించారు. రాజమహేంద్రవరం సౌత్ జోన్ డిఎస్‌పి ఎం.అంబికా ప్రసాద్, కడియం సిఐ బి.తులసీధర్ ఆధ్వర్యంలో కడియం పోలీస్ స్టేషన్ పరిధిలోని వేమగిరిలో సాయుధ బలగాలతో కలిసి పోలీస్ అధికారులు గ్రామంలో తిరుగుతూ ప్రజలకు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ, వారిలో ధైర్యాన్ని నింపే విధంగా ఫ్లాగ్ మార్చ్ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ, ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, దానికి పోలీసుల సహకారం ఎల్లవేళలా ఉంటుందని భరోసా కల్పిస్తున్నామన్నారు.

దేవరపల్లిలో పోలీసుల కవాతు

ప్రజాశక్తి -దేవరపల్లి

రాబోవు ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండాలని దేవరపల్లిలో ఆదివారం పోలీసులు కవాతు నిర్వహించారు. దేవరపల్లి పోలీస్ స్టేషన్ నుంచి శ్రీచైతన్య స్కూల్ వరకు మరియు యాదవోలు త్యాజంపూడి గ్రామాల్లో సెంట్రల్ ఆర్ముడు బలగాలతో పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి రామారావు మాట్లాడుతూ అందరూ కూడా ఎన్నికల్లో పాల్గొని ప్రశాంతంగా ఓటు వేసే విధంగా వారిలో ఆత్మస్థయిర్యం నింపే విధంగా ఉండాలని ఈ కవాతు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి పౌరుడు ఎలాంటి ప్రలోభాలకు తలొగ్గకుండా, భయభ్రాంతులకు గురి కాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకుంటూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐ బాల సురేష్ బాబు, ఎస్ఐ శ్రీహరి రావు, పోలీస్ సిబ్బంది సిఆర్పిఎఫ్ బలగాలు పాల్గొన్నాయి.

విద్యుత్ ఉప కేంద్రాలు ప్రారంభం


ప్రజాశక్తి - సీతానగరం

కాటవరం గ్రామంలో రూ.2.78 కోట్లతో, చినకొండేపూడిలో రూ.2.26 కోట్లతో నిర్మించిన రెండు విద్యుత్ ఉపకేంద్రాలను ఎంఎల్ఎ జక్కంపూడి రాజా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడా విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టిడిపి హయాంలో ఒక విద్యుత్ సబ్ స్టేషన్‌ను నిర్మించిన దాఖలాలు లేవన్నారు. నేడు సీతానగరం మండలంలో మరో రెండు సబ్ స్టేషన్లు ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. కాటవరం విద్యుత్ ఉప కేంద్రం వల్ల కాటవరం, జాలిమూడి, మునికూడలి, కూనవరం గ్రామ ప్రజలకు, చినకొండేపూడి విద్యుత్ ఉప కేంద్రం వల్ల చినకొండేపూడి, రఘుదేవపురం, సీతానగరం, సింగవరం, చీపురుపల్లి, నాగంపల్లి గ్రామాలకి విద్యుత్ అందించడమే కాక వ్యవసాయ రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నియోజకవర్గంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న విద్యుత్ ఉప కేంద్రాలను పూర్తిగా వాటి కెపాసిటీ పెంచే విధంగా చర్యలు తీసుకుటూ, ప్రతి రైతుకూ ఉచితంగా పగటిపూట నాణ్యమైన విద్యుత్ అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం రఘుదేవపురంలో జరిగిన ఆసరా కార్యక్రమంలో డ్వాక్రా మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇఇలు టివిఎస్ఎన్.మూర్తి, దాట్ల శ్రీధర్ వర్మ, వై.డేవిడ్, డిఇలు చిట్టి రాజు, టివిఎస్.రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ కేంద్రాలను ప్రారంభించిన ఎంఎల్ఎ రాజా

కార్టూ 'నిజం'



పల్లె బస్సులూ.. 'సిద్ధం' బాటలో

బూరుగుపల్లి శేషారావుకు టికెట్ ఇవ్వాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నిడదవోలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎంఎల్ఎ అభ్యర్థిగా మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావును తప్పనిసరిగా ప్రకటించాలని ఆదివారం టిడిపి ఆధ్వర్యంలో కాల్దారిలో భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మండలానికి చెందిన టిడిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వరకు కొవ్వొత్తులు చేతబట్టి, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉండ్రాజవరం మండలం టిడిపి అధ్యక్షులు సింహాద్రి రామకృష్ణ మాట్లాడుతూ జనసేన, టిడిపి సంయుక్తంగా విడుదల చేసిన తొలి జాబితాలో శేషారావు పేరు లేకపోవడం, తదనంతరం సోషల్ మీడియాలో పలు ఊహగానాలు చెలరేగడం నియోజవర్గ ప్రజలకు అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. నియోజకవర్గానికి సంబంధించని వ్యక్తిని నియమించడం పార్టీకి నష్టం చేకూర్చే అవకాశం ఉందని, విజయం పట్ల సందేహం కలుగుతోందన్నారు. తదుపరి విడుదల చేసే జాబితాలో తప్పనిసరిగా శేషారావు పేరును ప్రకటించాలని తెలుగుదేశం, జనసేన పార్టీల అధినేతలను కోరారు. పార్టీకి, అధిష్టానానికి విధేయుడుగా నడుచుకుంటూ, నియోజకవర్గ ప్రజలందరికీ అందుబాటులో ఉండే వ్యక్తి శేషారావు కనుక ఆయనకే సీటును కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వేలివెన్ను, కాల్దారి గ్రామాల అత్తిలి సత్యనారాయణ, చీపుళ్ల కుమారి, ఈర్పిన సత్యనారాయణ, వేముల వెంకట సత్యనారాయణ, రాచమళ్ల శ్రీను పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు



అమ్ములు కుటుంబాన్ని పరామర్శిస్తున్న బలరామకృష్ణ

పలు కుటుంబాలకు బత్తుల పరామర్శ

ప్రజాశక్తి - సీతానగరం

జనసేన జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి బత్తుల బలరామ కృష్ణ ఇటీవల మరణించిన పలువురి కుటుంబాలను ఆదివారం పరామర్శించారు. వెదుళ్లపల్లిలో కట్టూరి సత్యనారాయణ కుటుంబాన్ని, రామచంద్రపురం గ్రామంలో కోడెబత్తుల సీతారత్నం కుటుంబాన్ని, దాయిన గంగరాజు కుటుంబాన్ని, చాకలి మహేష్ కుటుంబ సభ్యులను, పురుషోత్తపట్నంలో పుట్టా అనంతలక్ష్మి మేనకోడలు దివ్య కుటుంబ సభ్యులను, కలపటపు అశోక్ కుమారుడు కిరణ్ కుటుంబాన్ని పరామర్శించారు. పురుషోత్తపట్నంలో అనారోగ్యంతో బాధ పడుతున్న మండ శేషయ్యను, వంగలపూడిలో అనారోగ్యంతో బాధ పడుతున్న ఆకుల మణికంఠను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మండ రాంబాబు, చాకలి శశికళ, షేక్ మీరా షరీఫ్ రాజు, వలవల రాజా, కాంద్రేగుల పోసీరత్నం, విజయ్ శంకర్ పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాల ముగింపు

ప్రజాశక్తి -దేవరపల్లి

పల్లంట్ల గ్రామంలో రాజరాజేశ్వరి సమేత దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వై.సుజనా శర్మ ఆధ్వర్యంలో పల్లకి సేవ, శ్రీపుష్ప యాగం కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యులు బలుసు సత్యనారాయణ విజయలక్ష్మి దంపతులు నిర్వహించారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. మండలంలో అన్ని గ్రామాల నుంచీ ప్రజలు ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు కూచిపూడి సతీష్, ఈడుపుగంటి శివరామ ప్రసాద్, మొక్కపాటి శ్రీనివాసరావు, ఎలమాటి చిన్నరామారావు, గన్నమణి సత్యప్రసాద్, కొయ్యలమూడి వేణు గోపాల్ కష్ణ, కొయ్యలమూడి కాశి, కొయ్యలమూడి విశేష్ చౌదరి, మద్దిపాటి శ్రీనివాసరావు, వల్లభనేని గాంధీ ప్రసాద్ పాల్గొన్నారు

ముక్కామల, ప్రక్కిలంకలో అన్నదానం

ప్రజాశక్తి -పెరవలి, తాళ్లపూడి

పెరవలి మండలం ముక్కామలలో భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి అలుగు సంబరం ముగింపు సందర్భంగా ఆదివారం యువజన సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు. కరేళ్ల రాజేంద్రప్రసాద్, కరేళ్ల సతీష్ ఆర్థిక సాయంతో ఈ అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఉమ్మడివారిపాలెం, బొక్కవారిపాలెం నల్లాకులవారిపాలెం, కాకరపర్రు తదితర గ్రామాల నుంచి 3500 మంది ఈ అన్నదానంలో పాల్గొన్నారు.

తాళ్లపూడి మండలం ప్రక్కిలంకలో శివాలయం వద్ద నెలరోజులుగా జరుగుతున్న సౌర యాగం ముగింపు సందర్భంగా ఆదివారం భారీ అన్నదానం నిర్వహించారు. సుమారు 4000 మంది అన్నదానంలో పాల్గొనానరు. కౌతవరపు విశ్వనాథ శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో జనం హాజరయ్యారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ శ్రీనివాస్





ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

జిల్లాలో వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా గ్రామీణ నీటి సరఫరా పథకం ఎస్ఇ ఎం.శ్రీనివాస్ అన్నారు. అన్ని ప్రాంతాలకూ సక్రమంగా తాగునీటిని అందించేందుకు ప్రత్యేక ప్రణాళికలు తయారు చేయడంతో బాటు చేతి పంపులన్నింటినీ మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. కాకినాడ జిల్లాలో 385 గ్రామ పంచాయితీల్లో 667 ఆవాసాల్లో 21 సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా పథకాల ద్వారా 374 ఆవాసాలకు రక్షిత మంచినీటి సరఫరా చేస్తున్నారు. వీటితో పాటు 710 రక్షిత మంచినీటి సరఫరా పథకాలు, 3415 చేతి పంపుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మిగిలిన అన్ని ఆవాసాలకూ తాగునీటి సరఫరా జరుగుతోందని తెలిపారు.

జల్ జీవన్ మిషన్ పనులు ఎలా జరుగుతున్నాయి.

మొత్తం 3,89,205 ఇళ్లకు కుళాయి ద్వారా మంచి నీరు సరఫరా చేయడానికి రూ.407.66 కోట్లకు ప్రణాళిక తయారు చేయగా ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ ద్వారా నిధులను మంజూరు చేసింది. ఇందులో మొత్తం 874 పనులు మంజూరు కాగా మూడేళ్ళలో ఇప్పటి వరకు రూ.97.85 కోట్ల విలువైన 385 పనులు పూర్తయ్యాయి. ఇంకా 153 పనులు పురోగతిలో ఉన్నాయి. 27 పనులు ప్రారంభమే కాలేదు.

మిగిలిన పనులకు టెండర్లు పూర్తి అయ్యాయా.

మొదటి విడతలో 565 ఆవాసాల్లో కుళాయిలను ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వ వాటా 50 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటా 50 శాతంతో మొత్తం రూ.245.03 కోట్లకు పరిపాలనా ఆమోదం లభించింది. ఇందులో రూ.5 లక్షల లోపు ఉన్న 18 పనులకు రూ.54 లక్షలు మంజూరు కాగా 13 పనులు ప్రారంభించి పూర్తి చేసారు. రూ.5 లక్షలు పైబడిన 410 పనులకు రూ.194.63 కోట్లు మంజూరు కాగా అన్ని పనులకు టెండర్ల ప్రక్రియను ఇప్పటి వరకు పూర్తి అయ్యాయి.

ఇంకా ఏయే పనులు పూర్తి కావాల్సి ఉంది.

ఇప్పటి వరకు 250 పనులు పూర్తయ్యాయి. మరో 121 పనులు పురోగతిలో ఉండగా ఇంకా 39 పనులు మొదలు కావాల్సి ఉంది.ఇప్పటికే ఉన్న త్రాగునీటి వనరుల పెంపుదల కేటగిరీలో భాగంగా రూ.49.86 కోట్ల విలువైన 137 పనులకు గాను 136 పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తి కాగా 106 పనులు పూర్తయ్యాయి. 30 పనులు పురోగతిలో ఉన్నాయి.

తాగునీటి ఎద్దడిపై తీసుకుంటున్న చర్యలు ఏమిటి.

జిల్లాలో రక్షిత మంచినీటి సరఫరా పథకాల మరమ్మతుల నిమిత్తం నాన్ సిఆర్ఎఫ్ గ్రాంట్ నుంచి ప్రతిపాదనలు తయారు చేశాము. జిల్లాలో తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాలను ప్రాధాన్యతా క్రమంలో గుర్తించి, సిఎండిఫ్ నిధుల నుండి మొత్తం 50పైనే పనులు మంజూరు అయ్యాయి.

సమ్మర్ యాక్షన్ ప్లాన్ గురించి చెప్పండి.

తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయనున్నాం. బోర్లు, చేతిపంపులు, పైపులైన్లకు మరమ్మతులు చేపట్టడానికి రూ.14.68 లక్షలతో ప్రతిపాదించాం. ప్రధానంగా కాకినాడ రూరల్ తూరంగి, మహాలక్ష్మి నగర్, వాకలపూడి, తాళ్ళరేవు మండలం తదితర ప్రాంతాలకు రవాణా సౌకర్యం ద్వారా సరఫరా జరుగుతుంది. 50 బోర్లు మరమ్మతులు కోసం రూ.6.18 లక్షలు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నింపడానికి, ఇతర రిపేర్లుకు రూ.8.50 లక్షలతో ప్రతిపాదనలు పంపాము.

నేరాలు ఘోరాలు

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-ఆలమూరు

ఒక వ్యక్తి అనుమానాస్పద మృతిపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎల్.శ్రీను నాయక్ తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని బడుగువానిలంకలో మార్గాని రమేష్ (43) అనుమానాస్పదంగా మృతి చెందాడు. అతడి భార్య పథకం ప్రకారం హత్య చేసినట్లు రమేష్ బంధువులు ఆరోపిస్తు ఫిర్యాదు చేశారు. అయితే రమేష్ రావులపాలెం ఆర్‌టిసి బస్ స్టాండులో జామకాయలు విక్రయిస్తు వచ్చిన సంపాదనతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి గ్రామ శివారు ఎన్‌టి రాజాపురం గ్రామ కూడలి వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసుల వివరాలు... ఆదివారం తెల్లవారుజామున పెద్దాపురంకి చెందిన బొడ్డు మోషే, అతని తండ్రి మరిడియ్య తన భార్య కలిసి ఎన్‌టి రాజాపురం బంధువులు ఇంటికి వచ్చి తిరిగి వెళ్లే క్రమంలో జంక్షన్ దాటుతుండగా జగ్గంపేట వైపు నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బొడ్డు మోషే అతని భార్య లక్ష్మి కుమారికి బలమైన గాయాలయ్యాయి. వారిని కాకినాడ జిజిహెచ్‌కు 108 అంబులెన్స్‌లో తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని గ్రామాల్లో ఆదివారం పేకాట శిబిరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వసంతవాడ గ్రామ శివారున పేకాట శిబిరంపై దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోనికి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.12,30 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.శ్రీనివాసు తెలిపారు

కోడి పందేలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి-చాగల్లు

మండలంలోని చిక్కాలపాలెం గ్రామ శివారులో శనివారం కోడిపందేలు ఆడుతున్న వారిపై చాగల్లు ఎస్ఐ పి.నాగరాజు సిబ్బందితో దాడి చేశారు. 11 మంది వ్యక్తులను అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుంచి రూ.33 వేల నగదు. రెండు కోళ్ల రెండు కత్తులను స్వాధీన పరచుకుని వారిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చాగల్లు ఎస్ఐ హెచ్చరించారు.



బియ్యం స్వాధీనం చేసుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది

పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి -దేవరపల్లి

గౌరీపట్నం జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం అక్రమంగా రవాణా చేస్తున్న 12,200 కేజీల పిడిఎస్ బియ్యంను సివిల్ సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది పట్టుకున్నారు. వ్యాన్ డ్రైవర్‌పై 6 ఎ, 7 కేసులను నమోదు చేశారు. వాహనాన్ని దేవరపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించి, బియ్యాన్ని గోపాలపురం ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించినట్లు సిబ్బంది తెలిపారు. దేవరపల్లి సివిల్ సప్లై డిటి సత్యనారాయణ, గోపాలపురం డిటి ప్రభాకరావు, రాజముండ్రి, నిడదవోలు డిటిలు పాల్గొన్నారు.

మద్యం అమ్ముతున్న ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-కడియం

మద్యం అమ్ముతున్న దుళ్ల గ్రామానికి చెందిన బొల్లం రాజు, కెఎన్.రాజును పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. కడియం ఎస్ఐ బి.నాగ దుర్గా ప్రసాద్, ఎస్ఐ టి.కృష్ణ సాయి ఆదివారం దాడులు నిర్వహించారు. ఎటువంటి లైసెన్స్, అనుమతి లేకుండా మద్యం సీసాలు అమ్ముతున్న ఇద్దరినీ అదుపులోనికి తీసుకున్నామని పేర్కొన్నారు.

ఎఎంసి డైరెక్టర్ శ్రీను మృతి తీరని లోటు

ప్రజాశక్తి-ఆలమూరు

మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, పెనికేరు వైసిపి నేత చవ్వాకుల శ్రీనివాస్ మృతి తీరని లోటని ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. శ్రీను ఆదివారం ఉదయం తన నివాసంలో కరెంట్ షాక్‌కు గురై మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంఎల్ఎ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రీను మృతదేహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీను పార్టీలో చాలా క్రియా శీలకంగా పనిచేసేవారని, ఆయన సేవలను గుర్తుచేసు కున్నారు. శ్రీను మృతి పట్ల కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న కుటు ంబ సభ్యులను పరామర్శించారు. వారికి అండగా ఉంటామన్నారు. అలాగే ఆకుటుం బానికి తక్షణ సాయంగా రూ.50 వేలు అంద జేశారు. ఆయన వెంట వైసిపి మండల కన్వీ నర్ తమ్మన శ్రీనివాస్, సర్పంచ్ వనుం చిన్నా వతి జార్జి బాబు, తదితర నేతలు ఉన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలంలోని జె.అన్నవరం గ్రామానికి చెందిన పలువురు టిడిపిని వీడి వైసిపిలో చేరారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వరుపుల సుబ్బారావు, ఎంఎల్‌సి అనంత ఉదయభాస్కర్‌లు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం గ్రామంలో గడపగడపకు వైసిపి కార్యక్రమం నిర్వహించారు. వైసిపి ప్రజా సంక్షేమ విధానాలు ప్రతి ఒక్కరికి ఆమోదియోగ్యంగా ఉన్నందున పార్టీలో చేరుతున్నారని అన్నారు. పార్టీలో చేరిన వారిలో జిగటాపు రాజు, కారు రమణ, దేగల రాజారావు, బెన్నోజు సుభద్ర ఆధ్వర్యంలో 50 కుటుంబాలు చేరాయి.

గ్లో గార్డెన్ పార్క్ ప్రారంభం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఇంత అద్భుతమైన పార్కు లేదని, రాజమండ్రి నగర శోభను మరింత ఇనుమడింప చేస్తుందని రాజమండ్రి ఎంపీ, వైసిపి సిటీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక లాలాచెరువు జంక్షన్ నుంచి క్వారీ మార్కెట్ కు వెళ్ళే దారిలో రూ.4.4 కోట్లతో అత్యద్భుతంగా నిర్మించిన 'గ్లో గార్డెన్'ను ఎంపీ భరత్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ గార్డెన్‌లో రుడా ఛైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, కమిషనర్ కె.దినేష్ కుమార్‌తో కలిసి ఎంపీ భరత్ కలయ తిరిగారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజమండ్రి నగర వాసులను, ముఖ్యంగా పిల్లలను ఈ గ్లో గార్డెన్ విశేషంగా ఆకట్టుకుంటుందని అన్నారు. నగరంలో కంబాల చెరువు పార్కుకు ఎంత ప్రజాదరణ లభించిందో దానికి రెండింతలు ఈ పార్కుకు ఎక్కువ ఆదరణ లభిస్తుందని ఆయన ఆకాంక్షించారు. అనంతరం నగరంలోని 50వ డివిజన్‌లో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన ఎస్‌బిఐ కాలనీ పార్కును, అదే వార్డులో రూ.40 లక్షలతో నిర్మించిన రెవెన్యూ కాలనీ పార్కును ఎంపీ భరత్ ప్రారంభించారు.



పార్కులో ఎంపీ భరత్‌తో సెల్ఫీలు

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ముగ్గురికి మంజూరైన ఆర్థిక సహాయాన్ని ఎంపీ భరత్ లబ్ధిదారులకు చెక్‌ల రూపంలో అందజేశారు. తలారి వెంకట శ్రీధర్‌కు రూ.4 లక్షలు, దుంగ సంధ్యకు రూ.3.5 లక్షలు, కొడమాటి శివ రామకృష్ణకు రూ.లక్ష చెక్కులను ఎంపీ భరత్ అందజేశారు.

నేడు యథావిధిగా కలెక్టరేట్‌లో స్పందన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ప్రతి సోమవారం నిర్వహించే జిల్లా, డివిజన్, మండల స్థాయి స్పందన కార్యక్రమం సోమవారం యథావిధిగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరంలోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి అందరూ జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని అన్నారు. అదేవిధంగా డివిజన్ స్థాయిలో ఆర్‌డిఒ, మునిసిపల్ స్థాయిలో కమిషనర్లు, మండల స్థాయి అధికారులు, గ్రామ స్థాయి, గ్రామ, వార్డు సచివాలయాల నుంచి ప్రజలు నుంచి సంబంధిత సిబ్బంది ప్రజల నుంచి స్పందన అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. జిల్లా కలెక్టర్, ఇతర జిల్లా అధికారులు ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు ఫిర్యాదులను కలెక్టరేట్ లో స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ, మున్సిపల్, మండల, గ్రామ, వార్డు సచివాలయాల్లో స్పందన ఫిర్యాదులు అందజేయాలని కలెక్టర్ తెలిపారు. మండల స్థాయి అధికారులు అందరూ మండల ప్రధాన కేంద్రంలో ఒకే చోట హాజరై ప్రజల నుంచి స్పందన అర్జీలు స్వీకరించాలన్నారు.

సైన్స్ ఉపయోగాలపై విద్యార్థులకు వర్క్ షాప్

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక రామారావుపేటలోని ఎసిటి సైన్స్ సెంటర్లో ఆదివారం వివిధ పాఠశాలల్లో చదివే 6వ తరగతి విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైన్స్ ప్రయోగాల సెంటర్ నిర్వాహకులు బుద్దా శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలలోని సైన్సు పాఠాలకు సంబంధించి ప్రయోగాల ద్వారా విశ్లేషణాత్మకంగా విద్యార్థులకు వివరించడం వల్ల సైన్సు పట్ల ఆసక్తి పెరుగుతుం దన్నారు. సైన్స్ ప్రయోగ పరికరాలు విద్యార్థుల చేతులకు ఇచ్చి వారితో ప్రయోగాలు చేయించడం జరిగింది. ఈ అవగాహన కార్యక్రమంలో ఆర్‌బి కొత్తూరు జడ్‌పి ఉన్నత పాఠశాల, తాటిపర్తి శ్రీ విద్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల, సామ ర్లకోట గౌతమి మోడల్ స్కూల్, పెద్దాపురం చాచా స్కూల్‌కు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ వర్క్ షాప్‌లో ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒఎన్‌జిసిపై ఉమ్మడి ఉద్యమానికి సిద్ధం కావాలి

ప్రజాశక్తి - కాకినాడ

కెజి బేసిన్‌లో ఆయిల్ నిక్షేపాల అన్వేషణ కారణంగా నష్ట పోతున్న మత్స్యకారులకు నష్టపరి హారం అందించే విషయంలో రాజకీ యాలకు అతీతంగా ఉమ్మడి ఉద్య మానికి సిద్ధం కావాలని అఖిలపక్షం పిలుపునిచ్చింది. స్థానిక లంగరు రేవు వద్ద ఒఎన్‌జిసికి వ్యతిరేకంగా మత్స్యకారులు చేస్తున్న నిరసన శిబిరాన్ని ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు ఆదివారం సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లా డుతూ మత్స్యకారులకు న్యాయం చేసే విషయంలో ఒఎన్‌జిసి సంస్థ మీనమేషాలు లెక్కించకుండా వెంటనే పరిహారంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మత్స్యకారులకు పరిహారం అందించాలన్న ఒకే ఒక్క అజెండాతో రాజకీయ పార్టీలన్నీ ఏకమై ఉమ్మడి కార్యాచరణకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే సిసిమిక్ సర్వేను నిలుపుదల చేశామని, ఒఎన్‌జిసి దిగి రాకపోతే సముద్రంలోకి వెళ్లి మరీ కార్యకలాపాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. జిల్లాస్థాయిలో కలెక్టర్ సమక్షంలో జరిగే చర్చలు ఫలప్రదం కాగలవని ఆశిస్తున్నామని, అలా కానిపక్షంలో సిఎంఒ స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసి మత్స్యకారులకు న్యాయం జరిగేలా కషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు తాటిపాక మధు, తోకల ప్రసాద్, కాటాడి జానకిరామ్, నరాల శివ, పిట్టా వరప్రసాద్, చెక్కా నూకరాజు, కుక్కల పోతురాజు, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న అఖిలపక్షం నాయకులు



గండేపల్లిలో జరిగిన మహిళా దినోత్సవ సభలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి

మహిళల హక్కుల సాధనే లక్ష్యం కావాలి

ప్రజాశక్తి - గండేపల్లి, పెద్దాపురం

మహిళలు తమ హక్కుల సాధనే లక్ష్యం గా ముందుకు సాగాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి అన్నారు. ఆదివారం మండలంలోని మురారి గ్రామంలో మండల యుటిఎఫ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా మహిళా అధ్యక్షురాలు నాగమణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రభావతి 'మహిళా సాధికారిత, సమాజంలో మహిళ పాత్ర' అనే అంశంపై మాట్లా డారు. మార్చి 8న అంతర్జాతీయంగా జరుగుతున్న మహిళా దినోత్సవానికి ఎంతో చరిత్ర ఉందన్నారు. ఎంతోమంది చేసిన పోరాటాల ఫలితంగా అన్ని దేశాల్లో మహిళలకు కొన్ని హక్కులు లభించాయని గుర్తు చేశారు. మహిళలకు విద్య, ఓటు హక్కు వచ్చిందంటే దానివెనుక ఎన్నో పోరాటాలు ఉన్నా యని అన్నారు. సమాజంలో నేటికీ మహిళలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ నేపథ్యంలోనే ఎంతోమంది మహిళలు ప్రపంచ వ్యాప్తంగా సమానత్వం కోసం తమ గొంతులను వినిపిస్తూనే ఉన్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల పట్ల చిన్నచూపుతూనే చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని దుయ్య బట్టారు. ఈ నేపథ్యంలోనే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని స్ఫూర్తిగా తీసుకుని తమ హక్కుల కోసం పోరాటాలను సాగించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అన్నరాము, కమిటీ నాగేష్, చక్రవర్తి, సాయిరామ్, పివివి.సత్య నారాయణ, సతీష్‌బాబు, నాగేశ్వరరావు, సుభాష్, రాజబాబు, లక్ష్మీదేవి పాల్గొన్నారు. అలాగే స్థానిక సిఐటియు కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రామిక మహిళ సమన్వయ కమిటీ కన్వీనర్ ఎరుబండి చంద్రావతి పాల్గొని మాట్లాడారు. పోరాటాల ద్వారానే హక్కులను సాధించుకోగల్గుతామని అన్నారు. స్కీం వర్కర్స్‌ని, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశా కార్యకర్తలు విఒఎలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అందుకు అవసరమైన నిధులను బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని కోరారు. అలాగే ఉద్యోగ భద్రత కల్పించాలని, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, స్త్రీలు, పురుషులు పనిచేసే చోట లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు వేయాలని, మహిళలకి చట్ట సభల్లో రిజర్వేషన్లు అమలు చేయా లని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో శ్రామిక మహిళా నాయకులు వైవి.రాజేశ్వరి, లలిత, దివ్య, జ్యోతి, కృష్ణవేణి, మణి, అర్జున పాల్గొన్నారు. పెద్దా పురం మండలం దివిలి గ్రామంలో ఏపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో యూనియన్ అధ్యక్షులు దాడి బేబీ అధ్యక్షతన మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి వరలక్ష్మి పాల్గొని మాట్లాడారు. దేశ వ్యాప్తంగా రోజురోజుకు మతోన్మాదం పెచ్చి మీరుతోందన్నారు. మతోన్మాదం పెరగటం వల్ల మహిళల హక్కులు కాల రాయపడతాయన్నారు. అంగన్వాడి యూనియన్ కార్యదర్శి ఎస్తేరు రాణి మాట్లాడుతూ పథకాల పేరుతో డబ్బులు పంచటం ద్వారా మహిళా సాధికారిత రాదని అన్ని రంగాల్లోనూ మహిళలను ప్రోత్సహించటం ద్వారా మాత్రమే మహిళా సాధికారిత సాధ్యమవుతుందన్నారు. అనేక పరిశ్రమల్లో మహిళలు కనీస సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారన్నారు. ఈ సభలో ఆశా వర్కర్స్ యూని యన్ నాయకులు నాగరత్నం, భవాని, ఎ.నూకరత్నం, మణికంఠ, లలిత, సూర్య కుమారి పాల్గొన్నారు.



నియామక పత్రాన్ని అందిస్తున్న డిఎంఅండ్ హెచ్ఒ నాయక్

క్రమబద్ధీకరణ పత్రాల అందజేత

ప్రజాశక్తి - కాకినాడ

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వైద్య ఆరోగ్య శాఖ కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు సంబంధించిన నియామక పత్రాలను వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి.నరసింహనాయక్ అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల జిఒ నెంబర్ 30, 31 ప్రకారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 290 మంది ఉద్యోగుల క్రమబద్ధీకరణ జరిగిందని తెలిపారు. అందులో భాగంగా 247 మందికి రాష్ట్ర వైద్య ఆరోగ్య సంచాలకులు నుంచి ఆదేశాలు వచ్చాయని, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 243 మంది అభ్యర్థులలో 192 ఎంసిహెచ(ఎం), 44 ఎంసిహెచ్(ఎస్)కు క్రమబద్ధీకరణ చేయడం జరిగిందన్నారు. ఫార్మసిస్ట్ గ్రేడ్ 17 గురికి సర్టిఫికెట్ వెరిఫి కేషన్ చేసి తదుపరి చర్యల నిమిత్తం రాజమహేంద్రవరం జోన్ రీజనల్ డైరెక్టర్ కార్యాలయానికి పంపడం జరిగిందన్నారు. మిగిలిన 43 ఉద్యోగుల క్రమబద్ధీకరణ రాష్ట్ర వైద్య ఆరోగ్య సంచాలకులు నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే వారికి కూడా క్రమబద్ధీకరణ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

తోలుబొమ్మలాట శిక్షణ ప్రారంభం

కాకినాడ రూరల్ : వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా కాకినాడ ఎన్‌ఎఫ్‌సిఎల్ రోడ్డులోని సత్యకళావాహినిలో తోలుబొమ్మలాట శిక్షణ కార్యక్రమం ఆదివారం ప్రారంభం అయ్యింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ కురసాల కన్నబాబు పాల్గొని మాట్లాడుతూ నృత్య దశలో నుంచి మానవుడు నాటక దశలోనికి ఎదిగే పరిణామ క్రమంలో తోలుబొమ్మలాట ప్రముఖ పాత్ర వహించిందని అన్నారు. యువత మన సాంప్రదాయాలు కళారూపాలను నేర్చుకునేలా వారికి తగిన వేదికను అందించాల ఈకార్యక్రమం చేపట్టినట్టు చెప్పారు.

యానాం వార్తలు

కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యం

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి పార్లమెంట్ స్థానానికి జరుగుతున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించడమే లక్ష్యంగా కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌ఛార్జ్ మల్లాడి సత్తిబాబు అన్నారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. యానాంలో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక శాతం ఓట్లు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని అన్నారు. ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా తనను నియమించిన పుదుచ్చేరి కాంగ్రెస్ పార్టీ అధిష్టానంకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీకి యానంలో పూర్వవైభవం తీసుకొస్తామని, తన రాజకీయ ప్రయాణం కాంగ్రెస్ పార్టీతోనే సాగుతుందని ఆయన స్పష్టం చేశారు.




బాధితురాలికి పత్రాలను అందిస్తున్న ఆర్ఎఒ మునిస్వామి

బాధితురాలికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - యానాం

రోడ్డు ప్రమాదంలో భర్తను కోల్పోయిన బాధితురాలికి ఆదివారం కాకినాడకు చెందిన చేయూత స్వచ్ఛందసంస్థ ప్రతినిధులు ఆర్థిక సాయాన్ని అందించారు. స్థానిక ఆర్ఎఒ ఛాంబర్లో జరిగిన కార్యక్రమంలో కురసాంపేటకు చెందిన బాధితురాలు వాడ్రేవు నూకరత్నంకు రూ.20వేలను ఫిక్సిడ్ డిపాజిట్ చేసి వాటి పత్రాలను నెలకు సరిపడా నిత్యావసర వస్తువులను ఆర్ఎఒ మునిస్వామి ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా చేయూత ప్రతినిధులు మాట్లాడుతూ సంస్థ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఎం.రవికుమార్, కార్యదర్శి ఎంఎ.అలీమ్, వైస్ ప్రెసిడెంట్ ఎస్.వలీభాషా, పవన్, ప్రవీణ్, జిలానీ, సుభహాన్, కామరాజు పాల్గొన్నారు.



స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

పరిసరాలను శుభ్రం చేసిన వాలంటీర్లు

ప్రజాశక్తి - యానాం

యానాం లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చేపట్టిన ఎన్.ఎస్.ఎస్.ప్రత్యేక శిబిరం కొనసాగుతోంది. మూడవ రోజైన ఆదివారం వాలంటీర్లు స్వచ్ఛభారత్, పచ్చదనం, పరిశుభ్రత వంటి కార్యక్రమాలను నిర్వహించారు. కళాశాల ఆవరణతోపాటు పరిసర ప్రాంతాలలో చెత్తా చెదారాన్ని, తుప్పలను తొలగించి శుభ్రం చేశారు. అలాగే కళాశాలలో గల మొక్కలకు నీరు పోశారు. అలాగే క్షయవ్యాధిపై అవగాహనా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ పృథ్వీకృష్ణ పాల్గొని మాట్లాడారు. క్షయవ్యాధి పట్ల ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండటం అవసరమని అన్నారు. క్షయవ్యాధిపై ఉన్న అపోహలను ప్రజలు నమ్మవద్దని కోరారు. క్షయవ్యాధికి మంచి వైద్యం అందుబాటులో ఉందని, మందులు వాడుతూ తగిన జాగ్రత్తలు తీసుకుంటే క్షయవ్యాధిని పూర్తిగా నివారించవచ్చని తెలిపారు. క్షయవ్యాధి లక్షణాలు ఉంటే అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యుని సంప్రదించాలని కోరారు. సదస్సులో కౌన్సిలర్ ఎస్ఎస్వి.శర్మ, ఆర్‌విజి.రాజు మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ఈ కార్యకమంలో ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, ఎన్ఎస్-ఎస్ పిఒ అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

వైసిపి ప్రభుత్వం ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తూ పేదలకు అండగా నిలిచిందని సర్పంచ్ యర్రంశెట్టి రామ చంద్రరావు అన్నారు. మునిపల్లి పంచాయతీలో ఆదివారం వాలంటీర్ ఎ. సునీతతో కలిసి సర్పంచ్ రామచంద్రరావు ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వం అయిదేళ్లలో ప్రతి ఇంటకీ చేకూర్చిన లబ్ధిని వివరించారు. పేదల సంక్షేమానికి పాటుపడుతున్న సిఎం జగన్‌ను మరోసారి సిఎంగా చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కొమ్ముల సూర్య నారాయణ, ఎస్.దేవి, పేరూరు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు యథావిధిగా స్పందన

ప్రజాశక్తి-అమలాపురం

స్థానిక కలెక్టరేట్‌లో గోదావరి భవన్ నందు జిల్లా స్థాయి 'స్పందన జగనన్నకు చెబుదాం' కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటల నుంచి యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగందృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు కోరాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఫోటోగ్రాఫర్ కుటుంబానికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి - గండేపల్లి

వృత్తిలో భాగంగా వచ్చిన ఫొటోగ్రాఫర్ హత్యకు గురియ్యాడని, సంబంధిత ఫొటోగ్రాఫర్ కుటుంబాన్ని ప్రభుత్వం న్యాయం చేయాలని ఫొటోగ్రాఫర్ల సంఘం నాయ కులు డిమాండ్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో ఆది వారం యూనియన్ ఆధ్వర్యంలో ఫొటోగ్రాఫర్లు ఆ సంఘటనకు సంబంధించి ఎస్ఐ రామకృష్ణకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు రాంబాబు మాట్లాడుతూ పొట్టకూటి కోసం వృత్తిని నమ్ముకుని వీడియో తీసేందుకు రాజమహేంద్రవరంకు వచ్చిన ఫొటోగ్రాఫర్ సాయిని అతిదారుణంగా హత్య చేశారని, ఈ సంఘటనపై పోలీసు అధికారులు స్పందించి ముద్దాయిలను అరెస్టు చేశారని, తక్షణమే తగిన శిక్ష పడేలా చూడాలని కోరారు. ప్రభుత్వం సాయి కుటుంబానికి తగిన న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఫొటోగ్రాఫర్లు పి.సూరిబాబు, బి.కోటేశ్వరరావు, కడియాల సత్యనారాయణ, పల్లి సత్తిబాబు, దాసరి ధన కుమార్, రమణ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో ఎదురైన ప్రత్యర్థులు

ప్రజాశక్తి - సామర్లకోట

పెద్దాపురం నియోజకవర్గంలో పోటీలో ఉన్న వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు, టిడిపి అభ్యర్థి, సిట్టింగ్ ఎంఎల్ఎ నిమ్మ కాయల చినరాజప్పల ఎన్నికల ప్రచారం ఆసక్తికరంగా మారింది. ఆదివారం సాయంత్రం సామర్ల కోట పట్టణంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అయితే బ్రౌన్ పేటలోకి రెండు పార్టీల ప్రచారాలు చేరుకోగా రెండు ప్రచారాలు ఎదురెదురుగా పడటంతో ఆసక్తికర పరిస్థితి ఏర్పడింది. రెండు పార్టీల జెండాలు ఒకే చోట కలిసి రెపరెప లాడాయి. ఆ సమయంలో రెండు పార్టీల మధ్య ఎలాంటి వాదనలకు అవకాశం లేకుండా ఎవరికి వారే వారి ప్రచారాలను కొనసాగించు కోవడంతో ప్రశాంతంగానే రెండు పార్టీల ప్రచారాలు సాగాయి.